కథానిక

# వర్ష స్మృతులు

"శ్రీవిరించి"

దీపావళి వస్తున్నదంటే తన మనసులో యింత కలవరం బయలుదేరుతుందేమిటి? గుండెల గుబగుబ యెంచేత? ఏమిటి తనకీ ఆవేదన అంతులేని ఉద్వేగం? ఇకపోదా యిది, ఆజన్మాంతం తననిపట్టి పల్లార్చాల్సిందేనా? తనేంపాపం చేసిందని యీ ఘోరశిక్ష తనకి?

ఏమో తెలీదు. ఎన్ని పాపాలు చేసిందో తెలీదు. ఎందుకో కారణం తెలీకుండా కష్టాలూ మానసిక వెతలూ అనుభవించాల్సిందే తను. మనుషులకు రాసివున్నదే అంత!

తనింత ఆవేదన యెందుకు పడుతున్నదీ తనకు తెలీనే తెలీదు. బొత్తిగా తెలీదు. ఇప్పటికి అయిదు సంవత్సరాలుగా యిదే బాధ. "దీపావళి" మాట విన్నప్పుడల్లా ఒళ్లు గరిపొడవటం స్మృతులు బాధ గుంతం కావటం జరుగుతునే వున్నది.

ఎందుకు కాదు? అతిసహజం!

జీవితంలో భాగస్వామిని కోల్పోయింది తను ఆరోజున, ఏమీలేదు. దీపావళిపండుగ వస్తున్నదంటే హుషారుగా అందుకు తయారయే సంసిద్ధులయే కూర్చున్నారు యిద్దరును! కాని రేపే చతుర్థసి అనగా ఒంటికి కొంచెం వేడితగిందింది. ఏమీ పెద్ద వుపద్రవంలేదు. మనిషిలోపల బాధ పడుతూన్నాడేమో కాని తనకోసం బయటికి హాయిగానే నవ్వుతూ కనిపిస్తున్నాడు. ఎన్నడూ లేని జ్వరం పండుగనాటికే తగిలిందే అని తనకి బెంగ. అబ్బ! ఎంత బుజ్జగించి చెప్పాడు తనకి. "వట్టిజ్వరానికే యింత కలవరపడితే యెలాగు, ఇవాళ వున్నది రేపటికి తగ్గిపోతుంది. నిన్న వున్నది కనకనా? మనసులో యేమీ భయపడకు. అందులో పండగరోజులు కూడాను" అన్నాడు. ఆ నాలుగు మాటలూ తనకు యీ నాటికి కూడా అచ్చం అతని నోటిలోంచి వచ్చిన తీరుగానే జ్ఞాపకం. అట్లానే జీవితాంతం వరకూ కూడా వుంటాయా? ఉంటే తనకు ఆవేదన??

కాని తనకి మనసులో భయంమాత్రంవదలదు. అంటే జరిగిన ప్రమాదం జరగనున్నదని తనకు ముందుగా తెలిసివుంది కాదు, యేదో అస్పష్ట భీతి, అవ్యక్తవేదన వూరికే మనసులో బెంగరేపి బెదురు కలిగించేందుకు. తననితానే వూరడించుకుందామని యెంత ప్రయత్నించినా బాధతగ్గదు. అయినా అతను నవ్వుతోంటే తనని నవ్విస్తోంటే మనసుదాచుకుని అతనికోసం అన్నట్టు! యేవిటో? యేమిటో!!

మరునాడు జ్వరం ఉదయం కొంత తగ్గినట్టు అనిపించింది. కాని మధ్యాహ్నానికల్లా మళ్ళీ పెద్దదయిపోయింది. ఒట్టిజ్వరం! ఇంకేమీ యితర "సింప్టమ్సు" లేవు. అయినప్పటికి పండగనాటికి ఉద్భృతం అయిచూస్తూ వుండగానే అతని పంచప్రాణాలూ అనంతవాయువుల్లో లీనమైపోయినాయి. అంతా తనకళ్ళముందే జరిగింది! ఏమేమనుకున్నారు; ఎంత ఆహ్లాదంగా గడిచిపోతుందని ప్లానులు వేసుకున్నారు. అంతా ప్రేతభూమి అయికూర్చుంది.

అతను — రాఘవరావు తన జీవితాన్ని ఎంత పులకితం జేసినాడు. అసలు తను యెవరు? తన జీవితానికి రాఘవయెవరు? ఎట్లాకుదిరింది యిద్దరికీ?

పదేళ్ళ కిందట యిద్దరూ ఒకే వూళ్ళో వుంటం, చిలికిచిలికి గాలివానయినట్టు ప్రథమ పరిచయం లగాయితు యెంతో ప్రేమ ఆరాధన బయలుదేరి ఒకనాడు తను వుద్రేకం పట్టలేక "యెన్నాళ్లు కాకిబతుకు, యేకాకిబతుకు?" అనడం ఎట్లామరచిపోతుంది తను? మనం అనుకున్నవన్నీ అనుకున్నట్లుగా నెరవేరుతాయా?

తనేమీ చెయ్యలేదు. దేని ఫలితమో, 'రాఘవ' పోయినాడు. అవును!

అతను చనిపోయాడని దిగులుచెంది తను యింట్లోకూర్చుంది. ఏడుపు. ఒకటే ధార. ఏమిటి దారి? తన కర్తవ్యం యేమిటి? ఏం చెయ్యాలి తను? ప్రకాశంవచ్చి పలకరించకపోతే తన గతి

యేమయేదో. అతను, "పాపం, ఎక్కువగా మనసులో విచారం పెట్టుకోకండి" అన్నాడు. అంతకన్నా యేమంటారు? కాని తనకి విచారం అంతరించదు.

"ఏంచేస్తారు మీరు? ఎక్కడికి వెళతారు?" అనడిగాడు ప్రకాశం తనని. అతనికి తెలీదు యెట్లాంటి పరిస్తితుల్లో రాఘవా తనూ యిక్కడ వుంటున్నది.

"మీనాన్నగారెక్కడ?"

చెప్పింది తను.

"ఉత్తరం రాశారా?"

"ఊఁహు."

"నేను రాయనా?"

"ఊహు!" అతనికి తెలీదు తమ కలయిక తన తండ్రికి యిష్టంకాని పరిస్థితుల్లో జరిగిందని. రాఘవకి యెవరూ లేరు. దిక్కులేనివాడు. అట్లాంటివాడు తన కూతురికి తగునా? తన తండ్రిమాట కాదని రాఘవతో కలిసిపోయింది. ఇద్దరుకాదు, ఒకటే స్వరూపం రాఘవా, తనూ. కాని రాఘవ విధికృతంచేత తన్నువొదిలి—ఇప్పుడు తను వొక్కతే!

చంద్రుడు ఆకాశంలో తారట్లాడుతూండగా తారికలు తిరుగుతూండగా వెన్నెల దిక్కులేకుండా కాస్తుండగా కథంతా ప్రకాశంతో చెప్పుకుని తను యేడుస్తోంది. ప్రకాశానికి అంతా ఆశ్చర్యం.

"నాకు తెలీదు. ఎన్నడూ రాఘవ చెప్పాడు కాదు" అంటాడు.

"అవును చెప్పడు. అతిగంభీరం—అతనికి"

"ఇప్పుడు యేమిటీ" యేదో అంటాడు ప్రకాశం, అతని గొంతులోమాట తడబడి బయటికి రాదేం?

"ఏముఖంపెట్టుకుని మా నాన్న దగ్గరికి వెళ్ళను?"

"వెళ్ళొద్దు"

వెళ్ళక తను చెయ్యగలదేమిటి? తనకూ యిష్టం లేదు. కాని వెళ్ళాలి. తండ్రి రానిస్తాడా, రానివ్వకపోతే? ఏమీ లోచదు తనకి!

ఏమైనా "వెళ్ళొద్దు" అంటాడు ప్రకాశం

"ఏంచెయ్యను?"

"ఏంచేస్తారు?" అనడుగుతాడు తననే!

"ఆనాధని"

తరవాత యేం జరిగిందో యేం మాటాడుకున్నారో తెలీదు తనకి, ప్రకాశానికికూడా తెలీదు కావును. గుర్తురాదు యెంత ప్రయత్నించినాగాని.

మళ్ళీ తన జీవితానికి ఆనంతం-ప్రకాశం చాటున వికాసం బయలుదేరుతాయి. అట్లా అనుకుందా తను యెన్నడయినా? కాదు, అనుకోనివే జరుగుతాయి, వాంఛించినవి జరగవు! ఈ మనుషులు నివసించే ప్రపంచంలో.

అప్పుడే అయిదు సంవత్సరాలు గడిచినాయి, ప్రకాశం తనని చేపట్టి. అంతా గుర్తువచ్చినప్పుడు క్షణం కిందటో అరక్షణం కిందటో జరిగినట్టుంటుంది. అబ్బ! ఎంత మధురం-రోజులు!

కాని, దీపావళివస్తున్నదంటే వచ్చేస్తున్నదంటే విషాదం తనని కమ్మేస్తుంది. ఇతరరోజుల్లో తనకి జరిగిన యీ అనుభవాలు గుర్తువుండవు, ఆ ఆనందంలో ప్రకాశం గుర్తుకి రానియ్యడు. దీపావళి వస్తుందనగా వారంరోజులూగడిచినమీదటు వారం రోజులూ తనకీ ప్రకాశానికీ యేమీతోచదు. ఏమీతెలీదు. చచ్చిపోయిన రాఘవ ముందు తామిద్దరూ యెవరు? ఎవరు కోరారు తమ జీవితాలు కలిసి ఒకేబాటలో నడవాలని?

ఐతే రోజులు దొర్లుకుపోతూనే వున్నాయి. జీవితంలో గతించిన స్మృతులు అట్లా హృదయాల్లో దొలిచినట్టు నిలిచిపోతున్నాయి. దేనికీ యెవరూ బాధ్యులు కారు.

జీవితానికి అత్యంతావసరమైన వస్తువుని ఒకడు ఉత్పత్తిచేస్తాడు. వాడికి సాధారణ జీవనానికి బొటాబొటీగా సరిపోయే ఆదాయం మాత్రమే వస్తుంది. ఇంకొకడు మనుష్యులకి ఏమంత అవసరంలేని వస్తువులు తయారుచేసి, తద్వారా కుబేరుడైపోతాడు.